'గీతం' చేరుకున్న ఈవీఎంలు

- గట్టి బందోబస్తు మధ్య స్ట్రాంగ్‌రూంకు తరలింపు
- ఏడు నియోజకవర్గాల భవిత భద్రం
- స్ట్రాంగ్‌రూంలన పరిశీలించిన కలెక్టర్ వల్లూరు క్రాంతి
- భారీ భద్రత కల్పించిన పోలీసులు

జహీరాబాద్ ఈవీఎంల స్ట్రాంగ్‌రూం వద్ద కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎస్పీ రూపేశ్

పటాన్‌చెరు, మే 14: జహీరాబాద్ ఎంపీ నియోజకవర్గానికి జరిగిన ఎన్నికలకు సంబంధించి ఈవీఎంలు గీతం యునివర్సిటీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూంకు చేరాయి. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామంలోని గీతం యునివర్సిటీ స్ట్రాంగ్ రూంకు ఈవీఎంలు వచ్చాయి. కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎస్పీ రూపేశ్ స్ట్రాంగ్‌రూంలను పరిశీలించారు. వాహనాల్లో భద్రంగా తీసుకొని వచ్చిన ఈవీఎంలను ఎన్నికల సిబ్బంది ఏడు నియోజకవర్గాలకు కేటాయించిన గదుల్లోకి తరలించారు. జుక్కల్, బాన్స్‌వాడ, ఎల్లారెడ్డి, కామారెడ్డి, నారాయణఖేడ్, ఆందోల్, జహీరాబాద్ నియోజకవర్గాల ఈవీఎంను గీతంకు తీసుకువచ్చారు. వాటిని క్రమ పద్ధతిలో అమర్చి స్ట్రాంగ్‌రూంలను సీల్ వేశారు. స్ట్రాంగ్‌రూంల ముందు సాయుధ బలగాలను పెట్టి భద్రతను కల్పించారు. సీసీ కెమెరాల పహారాలో ఈవీఎంలు భద్రపరిచారు. ఈ సందర్భంగా అన్ని నియోజకవర్గాల స్ట్రాంగ్ రూంల సీల్స్‌ను, అక్కడ ఏర్పాటు చేసిన భద్రతను కలెక్టర్, ఎస్పీలు పరిశీలించారు. ఈవీఎంలను భద్రపర్చడంలో సమస్యలు ఏమైనా ఎదురయ్యాయా? అని ఎన్నికల అధికారులను అడిగి తెలుసుకున్నారు. అన్ని సజావుగా జరిగాయని ఎన్నికల అధికారులు తెలపడంతో కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎన్నికల అధికారులు, పోలీస్ అధికారులు, ఎన్నికల అబ్జర్వర్లు పాల్గొన్నారు.

కామారెడ్డి ఈవీఎంల స్ట్రాంగ్ రూం వద్ద కాపలాగా సాయుధ బలగాలు

గీతం యునివర్సిటీ వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ క్రాంతి వల్లూరు, ఎస్పీ రూపేశ్

సాయుధ, పోలీసు బందోబస్తు మధ్య కంటైనర్లలో తరలుతున్న ఈవీఎంలు

ఈవీఎంలకు కట్టుదిట్టమైన భద్రత

చౌటకూర్, మే 14: జహీరాబాద్ లోక్‌సభ ఎన్నికకు సంబంధించి పోలింగ్ బ్యాలెట్ యూనిట్లను మంగళవారం స్ట్రాంగ్ రూంకు తరలించారు. అందోలు నియోజకవర్గంలోని తొమ్మిది మండలాల్లోని 313 పోలింగ్ కేంద్రాల నుంచి బ్యాలెట్ యూనిట్లు, వీవీ ప్యాట్లు వాహనాల్లో సోమవారం అర్ధరాత్రి వరకు జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్ రూంకు తీసుకువచ్చారు. 313 పోలింగ్ కేంద్రాల నుంచి బ్యాలెట్ యూనిట్ 1, 2లతోపాటు కౌంటింగ్ యూనిట్లు, వీవీ ప్యాట్లను ఆయా రాజకీయ పార్టీలకు చెందిన ఎన్నికల ఏజెంట్ల సమక్షంలో పరిశీలించారు. పోలింగ్ కంటే ముందు రోజు జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల స్ట్రాంగ్ రూం నుంచి ఆయా పోలింగ్ కేంద్రాలకు ఎన్ని బ్యాలెట్ యూనిట్లు పంపామో అవి పూర్తిగా వచ్చాయా లేదా అని ఒకటికి రెండు సార్లు సరి చూసుకున్నారు. అందోల్ నియోజకవర్గంలోని సుదూర ప్రాంతాల నుంచి పోలింగ్ సిబ్బంది వాహనాల్లో బ్యాలెట్ యూనిట్లను సోమవారం అర్ధరాత్రి వరకు తరలించారు. అందోలు-జోగిపేట ఆర్డీవో పాండు, సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యగౌడ్, జోగిపేట సీఐ అనిల్‌కుమార్, పుల్కల్ ఎస్ఐ కె.శ్రీకాంత్‌ల పర్యవేక్షణలో రెండు కంటైనర్లలో మంగళవారం తెల్లవారుజామున పటాన్‌చెరు మండలం రుద్రారం సమీపంలోని గీతం యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంకు తరలించారు. జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు జరుగనుంది.

ఏ పార్టీకి ఎన్ని ఓట్లు?

ప్రధాన పార్టీల నాయకుల సమాలోచనలు

జిన్నారం, మే 14: లోక్‌సభ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు జరిగిన పోలింగ్ సరళిపై నాయకులు సమాలోచనలు చేస్తున్నారు. పోలింగ్ బూత్‌ల వారీగా పోలైన ఓట్లలో మన కెన్ని ఓట్లు వచ్చాయి అనే లెక్కలు ప్రధాన పార్టీల నాయకులు వేస్తున్నారు. ప్రధాన పార్టీ కంటే మనం కొంతైనా లీడ్ ఇవ్వాలనే ఆశను వ్యక్తం చేస్తున్నారు. పోలింగ్ రోజున రెండు ప్రధాన పార్టీలకు చెందిన కిందిస్థాయి క్యాడర్ మరో పార్టీకి ఓట్లు సైలెంట్‌గా వేశారని వారే బాహాటంగా చెబుతున్నారు. మాకు ఓటేయండి.. లేదంటే దానికి వెయ్యండి.. ఈ పార్టీకి మాత్రం ఓటు ఎయ్యకుండి తమ్మీ అని బతిమిలాడిన నాయకులు ఉన్నారు. ఉన్న నాయకులందరు ఆ పార్టీలోకి వెళ్లారు. మేము లీడ్ ఇచ్చి వారు తలదించుకునేలా చేస్తామని మాటల చర్చలు నడిచాయి. మొత్తంగా తమది లీడ్ అంటే తమది లీడ్ వస్తుందని ప్రధాన పార్టీల నాయకులు చర్చించుకుంటున్నారు. బొల్లారం, ఖాజీపల్లి, గడ్డపోతారం, బొంతపల్లి పారిశ్రామికవాడలోని ఆంధ్ర ప్రాంత కార్మికులు ఓట్లేసేందుకు వారి సొంత ప్రాంతానికి వెళ్లడంతో కొంత పోలింగ్ శాతం తగ్గింది. బొల్లారం మున్సిపాలిటీలో దాదాపు నాలుగు వేల వరకు ఓటర్లు ఆంధ్రకు తరలివెళ్లారు. ఆ ఓట్లు ఏ పార్టీకి మైనస్ అనే దానిపై ఒక ప్రధాన పార్టీ నాయకుడు మాట్లాడుతూ తగ్గిన ఓట్లు మా పార్టీవే అని బహిరంగంగానే చెప్పారు.

ఎన్నికల సిబ్బందిపై పోలీస్‌ల ప్రతాపం

ఎన్నికల సిబ్బందిపై లాఠీ చార్జి చేస్తున్న పోలీసులు

- రెమ్యునరేషన్ అడిగినందుకు ఎన్నికల సిబ్బందిపై లాఠీచార్జి
- నారాయణఖేడ్‌లో సోమవారం రాత్రివరకు హల్‌చల్
- ఖండించిన ఉపాధ్యాయ సంఘాలు

నారాయణఖేడ్, మే 14: పోలింగ్ విధులు నిర్వహించినందుకు ఇతర పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో చెల్లిస్తున్న విధంగా రెమ్యునరేషన్ చెల్లించాలని కోరిన ఉపాధ్యాయులపై పోలీసులు తమ ప్రతాపం చూపారు. పోలింగ్ సిబ్బంది సంతృప్తి చెందే విధంగా రెమ్యునరేషన్ ఇవ్వకపోవడంతో ఉపాధ్యాయులు అక్కడే బీమ్కించుకు కూర్చోవడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. వివరాల్లోకి వెళ్తే.. ఎంపీ ఎన్నికల్లో భాగంగా సోమవారం పోలింగ్ విధులు ముగించుకొని పోలింగ్ సిబ్బంది పంపిణీ కేంద్రం వద్దకు చేరుకున్నారు. పోలింగ్ విధులకు సంబంధించి జి.ఓ 61 నిబంధనల ప్రకారం రెమ్యునరేషన్ చెల్లించాలని ఉపాధ్యాయులు ఆర్డీవో అశోక చక్రవర్తిని కోరారు. ఆర్డీవో అందుకు ఒప్పుకోకుండా రూ.2,400లు చొప్పున చెల్లిస్తామని చెప్పడంతో ఉపాధ్యాయులు అందుకు నిరాకరిస్తూ నిరసనకు దిగారు. దీంతో అక్కడికి చేరుకున్న పోలీసులు ఉపాధ్యాయులను శాంతింపజేసే ప్రయత్నంలో పోలీసులకు, ఉపాధ్యాయులకు మధ్య తోపులాట జరిగింది. పోలీసులు పలువురిపై దురుసుగా వ్యవహరించడమే కాకుండా స్వల్ప లాఠీచార్జి చేయడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. అనంతరం అధికారులు జోక్యం చేసుకొని ఉపాధ్యాయులను శాంతింపజేసి ఉన్నతాధికారులను సంప్రదించారు. వారి ఆదేశాల మేరకు రెమ్యునరేషన్ చెల్లిస్తామని చెప్పడంతో ఉపాధ్యాయులు రాత్రి వరకు అక్కడే వేచి ఉన్నారు. అయినా అధికారులెవరూ స్పందించకపోవడంతో చేసేదేమిలేక వెనుదిరిగారు. ఈ సందర్భంగా టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ సంతృప్తికరమైన రెమ్యునరేషన్ ఇవ్వాలని కోరినందుకు ఉపాధ్యాయులను పోలీసులతో కొట్టించడమేంటని మండిపడ్డారు. 61 ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం పోలింగ్ విధులు నిర్వహించిన ఉద్యోగులకు రూ.3,150 చెల్లించాల్సి ఉండగా ఇక్కడ మాత్రం రూ. 2,400 చెల్లించారన్నారు. ఉపాధ్యాయులపై లాఠీచార్జి చేయించిన నారాయణఖేడ్ ఆర్డీవోపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉపాధ్యాయులపై లాఠీచార్జి అమానుషం

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి

ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డి

సంగారెడ్డి కలెక్టరేట్, మే 14: ఉపాధ్యాయులపై జరిగిన లాఠీచార్జిని పీఆర్టీయూ నాయకులు ఖండించారు. మంగళవారం సంగారెడ్డికి వచ్చిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులపై లాఠీచార్జి అమానుషమన్నారు. ఎన్నికల విధులు నిర్వహించిన విధులకు రావాల్సిన రెమ్యునరేషన్ అడిగిన ఉద్యోగులపై లాఠీచార్జి చేయడం సరికాదన్నారు. లాఠీచార్జీకి కారణమైన అధికారులపై వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు రావాల్సిన రెమ్యునరేషన్ ఉత్తర్వులకు అనుగుణంగా, మిగతా జిల్లాలవారు చెల్లించిన విధంగా చెల్లించాలని ఉదయం నుంచి ఉపాధ్యాయులు కోరితే వారిపై అమానుషంగా లాఠీచార్జి చేశారని పేర్కొన్నారు. అందుకు కారకులైన అధికారులపై కఠిన చర్యలు చేపట్టాలన్నారు. లేనియెడల ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అంతకు ముందు పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి తొగర్‌పల్లి మధన్‌గోపాల్‌ను పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డిని కలిసి ఎమ్మెల్సీ పరామర్శించారు. ఇటీవల ఇంట్లో జారిపడి మధన్‌గోపాల్ కాలు ఫ్రాక్చర్ అయింది. కార్యక్రమంలో పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి, రాష్ట్ర, జిల్లా నాయకులు రామకృష్ణారెడ్డి, శ్రావణ్, ప్రవీణ్, లక్ష్మయ్య, నర్సింలు, ప్రశాంత్, రమేశ్, శేఖర్ పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం

రాయికోడ్, ఏప్రిల్ 14: గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులకు తనవంతుగా ప్రోత్సహిస్తున్నానని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు డాక్టర్ రవికిరణ్ అన్నారు. మండల పరిధిలోని రాయిపల్లి(సి) గ్రామంలో క్రికెట్ క్రీడాకారులకు అవరమైన ఆట వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సొంత నిధులతో క్రీడా సామగ్రి పంపిణీ చేసినట్లు తెలిపారు. క్రీడలతో మానసిక ఉల్లాసం, శరీర దారుఢ్యం లభిస్తుందన్నారు. నాయకులు బస్వరాజ్, నరేశ్, రమేశ్ ఉన్నారు.

కంపుకొడుతున్న 'భెల్' పరిసరాలు

- అస్తవ్యస్తంగా పారిశుధ్యం
- చెత్తాచెదారం తింటున్న బర్రెలు, మూగజీవాలు
- సమస్య పరిష్కరించాలని కోరుతున్న స్థానికులు

భెల్‌లో రోడ్డుకు పక్కన పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తింటున్న బర్రెలు

రామచంద్రాపురం, మే 14: ఒకప్పుడు బీహెచ్ఈఎల్ అంటేనే పచ్చని చెట్లు, ప్రశాంతమైన వాతావరణానికి నెలవు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడం లేదు. భెల్‌లోని పార్కులు నిర్వహణ సక్రమంగా లేక పూర్తిగా అధ్వాన స్థితికి చేరుకున్నాయి. భెల్ పరిసరాల్లో ఎటు చూసినా అపరిశుభ్రత తాండవం చేస్తున్నది. రోడ్ల మీదకు చెత్తాచెదారం చేరి పరిసరాలు కంపుకొడుతున్నాయి. ఒకప్పుడు భెల్‌లో పారిశుధ్య సమస్యలు పెద్దగా ఉండేవి కాదు. నిత్యం అధికారుల పర్యవేక్షణ ఉండేది. ఏ చిన్న ఫిర్యాదు వచ్చినా వెంటనే అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించేవారు. ఈ మధ్యకాలంలో భెల్‌లో చాలా సమస్యలు ఉత్పన్నమవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకున్న పాపానపోవడంలేదు. ఎల్ఐజీ నుంచి భెల్ గేట్‌లోకి ప్రవేశించే రోడ్డు మార్గంలో చెత్తాచెదారంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతున్నది. అలాగే కాస్తా ముందుకువెళ్లి మాయబజార్ మార్గంలో చెత్త డంపింగ్ చేయడంతో ఆ చెత్తచెదారం, ప్లాస్టిక్ కవర్లు రోడ్డుపైకి రావడంతో వాహదారులకు, పాదాచారులకు ఇబ్బందికరంగా మారింది. అక్కడ డంపింగ్ చేసిన చెత్తను కాల్చడంతో వాతావరణ కాలుష్యం కూడా ఏర్పడుతుంది. రోడ్లపై పేరుకుపోయిన చెత్తాచెదారం, ప్లాస్టిక్ కవర్లను బర్రెలు, ఇతర మూగజీవాలు తింటూ రోగాలబారీన పడుతున్నాయి. బర్రెలు చెత్తను తినడంతో పాలు కలుషితమయ్యే ప్రమాదం ఉంది. మ్యాక్‌సొసైటీ ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్ సమీపంలో, అన్నమయ్య ఎన్‌క్లేవ్ మార్గంలో, ఓల్డ్ ఎంఐజీకి వెళ్లే మార్గంలో పారిశుధ్య సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

రేపు జాబ్ మేళా

సంగారెడ్డి కలెక్టరేట్, మే 14: స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో ఈ నెల 16న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణా భాయి మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఏదేనీ డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులన్నారు. 2022, 23, 24లో డిగ్రీ పూర్తయిన అభ్యర్థులు కూడా హాజరుకావచ్చని పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 16న ఉదయం 10 గంటల నుంచి జరిగే జాబ్‌డ్రైవ్‌కు హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హుండీ లెక్కింపు వాయిదా

చేర్యాల, మే 14: కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో బుధవారం నిర్వహించనున్న హుండీల లెక్కింపును వాయిదా వేసినట్లు ఆలయ ఈవో బాలాజీ మంగళవారం ప్రకటనలో తెలిపారు. పలు కారణాలతో 28 హుండీల ఆదాయ లెక్కింపును వాయిదా వేసినట్లు పేర్కొన్నారు.

మారథాన్‌లో రాణిస్తున్న యువకుడు

- 8 మారథాన్, 24 హాఫ్ మారథాన్‌లో పాల్గొన్న మహేందర్
- పలురురి చేత ప్రశంసలు, అవార్డులు
- నిత్యం 5-10 కిలోమీటర్ల పరుగు

హైదరాబాద్‌లో నిర్వహించిన మారథాన్‌లో పరుగెడుతున్న మహేందర్(ఫైల్)

హుస్నాబాద్‌టౌన్, మే 14: ఆరోగ్యమే మహాభాగ్యం.. ఫిట్‌నెస్‌గా ఉంటేనే ఏదైనా సాధించగలం. నిత్యం రన్నింగ్ చేయడమే కాదు.. వందల కిలోమీటర్లు పరుగు తీస్తూ రికార్డులు సృష్టిస్తున్నాడు హుస్నాబాద్ పట్టణానికి చెందిన బత్తుల మహేందర్. సమాజంలో నడకపై, ఆరోగ్యంపై అవగాహన తీసుకురావాలనే ఆశయంతోనే నిత్యం పరుగు తీస్తూ ఎందరికో స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాడు. కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం పెరుకపల్లికి చెందిన బత్తుల మహేందర్ వ్యాపార రీత్యా హుస్నాబాద్ పట్టణంలో స్థిరపడ్డాడు. ఎంబీఏ పూర్తిచేసి వ్యాపారం నిర్వహిస్తున్న మహేందర్ హైదరాబాద్‌లో చదువుతున్న క్రమంలోనే మారథాన్ ఆయనను విశేషంగా ఆకర్షించింది. చదువుకునే వయసులో ఎన్‌సీసీలో చేరి దేశ రాజధాని ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ వద్ద నిర్వహించిన పరేడ్‌లో సైతం పాల్గొన్నాడు. క్రమంగా మారథాన్‌లో పాల్గొనాలని పట్టుదల పెంచుకున్నాడు. స్వతహాగా క్రీడలపై ఆసక్తి ఉన్న మహేందర్ స్థానిక ఎల్లమ్మ చెరువు కట్టపై నిత్యం పరుగు తీసేవాడు. 2017లో ప్రారంభమైన మహేందర్ రన్నింగ్ తీరును చూసిన అప్పటి హుస్నాబాద్ సీఐ రఘుపతిరెడ్డి, అక్కన్నపేట ఎస్ఐ రవికుమార్ ఫిట్ ఇండియా ఫౌండేషన్‌లో చేరాలని సూచించారు. వారి సూచన మేరకు సిద్దిపేట ప్రాంతంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టడమే కాకుండా మారథాన్‌పై ఆరు నెలలపాటు శిక్షణ పొందాడు.

32 మారథాన్లలో పరుగు

బత్తుల మహేందర్ ఇప్పటివరకు 32 మార్లు వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన మారథాన్, హాఫ్ మారథాన్‌లో పాల్గొన్నాడు. ముంబై, హైదరాబాద్, వైజాగ్, విజయవాడలో నిర్వహించిన 8 మారథాన్‌లో పాల్గొన్నారు. ఆయా మారథాన్‌లో నాలుగు గంటల సమయంలో 42.25 కిలోమీటర్ల లక్ష్యాన్ని చేరుకున్నాడు. అలాగే హైదరాబాద్, సిద్దిపేట, హుస్నాబాద్, కరీంనగర్, వైజాగ్, భూపాలపల్లి, విజయవాడలో పలు సంస్థలు చేపట్టిన 24 హాఫ్ మారథాన్‌లలో పాల్గొన్నాడు. 21.1కిలోమీటర్ల లక్ష్యాన్ని 1.45 గంటల్లో చేరుకుని నిర్వాహకుల చేత ప్రశంసలు అందుకున్నాడు. రాష్ట్రం, దేశంలో ఎక్కడ మారథాన్, హాఫ్‌మారథాన్‌లు నిర్వహించినా అందులో పాల్గొనడం ఆయనకు హాబీ. పైగా కుటుంబ సభ్యుల సహకారం తోడవడంతో రన్నింగ్‌లో దూసుకుపోతున్నాడు.

రోజుకు 5 నుంచి 10 కి.మీ. రన్నింగ్

మహేందర్ రోజూ ఐదు నుంచి పది కిలో మీటర్ల మేర రన్నింగ్ చేస్తున్నాడు. తన ఆహారపు అలవాట్లను మార్చుకొని రోజూ ఉదయం మొలకలు, బాదం, పిస్తా, మధ్యాహ్నం మాత్రమే అన్నం తీసుకుంటున్నట్లు చెబుతున్నాడు. రాత్రి పండ్లు తీసుకుంటూ ఆరోగ్యాన్ని పరిరక్షించుకుంటున్నాడు. హైదరాబాద్‌తోపాటు పలు ప్రాంతాల్లో నిర్వహించే మారథాన్‌లలో పాల్గొనడం ఖర్చుతో కూడుకున్నప్పటికీ వెనుకాడటం లేదు.

నా ఫిట్‌నెస్‌కు రన్నింగే కారణం

మన అలవాట్లే మన ఆరోగ్యాన్ని కాపాడుతాయి. డబ్బులు కూడా పొదుపు అవుతున్నాయి. ఫిట్‌నెస్ అనేది ప్రతి ఒక్కరికీ తప్పనిసరి. నిత్యం రన్నింగ్ చేస్తున్నా కాబట్టే ఫిట్‌నెస్‌గా ఉన్నా. ప్రతి ఒక్కరూ నడక లేదా రన్నింగ్‌తో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. ప్రజల ఆరోగ్యం కోసం వాకింగ్, రన్నింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

- బత్తుల మహేందర్, హుస్నాబాద్‌టౌన్

సిద్దిపేటలో మెడల్ అందుకుంటున్న మహేందర్(ఫైల్)

చిమ్లాపూర్‌లో పనులను పరిశీలిస్తున్న ఉపాధి హామీ అధికారులు

ఉపాధి హామీ పనుల పరిశీలన

రాయికోడ్, ఏప్రిల్ 14: మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను తనిఖీ చేశామని ఉపాధి హామీ మండల అధికారులు విష్ణువర్ధన్, రమేశ్ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని చిమ్లాపూర్ గ్రామశివారులో అమృత్ సరోవర్ పథకంలో భాగంగా చెరువులో చేపట్టిన పూడికతీత పనులను డ్రోన్ కెమెరాతో పరిశీలించారు. పనుల వివరాలను ఢిల్లీలోని ప్రధన కార్యాలయానికి పంపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధి హామీ అధికారులు మణికుమార్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీల నిరసన

జహీరాబాద్ ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన చేస్తున్న కూలీలు

కోహీర్, మే 14: చేసిన పనికి తగిన బిల్లు లు చెల్లించడం లేదని ఉపాధిహామీ కూలీలు నిరసన వ్యక్తం చేశారు. మంగళవారం జహీరాబాద్ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఉపాధిహామీ కూలీలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మా ట్లాడుతూ పనికి తగిన బిల్లులు చెల్లించడం లేదని మండిపడ్డారు. పని భారం మాత్రం పెంచారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కో కూలీకి రోజుకు రూ.300 వరకు ఇవ్వాల్సిన అధికారులు తమకు ఇష్టం వచ్చినట్లు చెల్లిస్తున్నారని ఆరోపించారు. బిల్లులు కూడా సకాలంలో చెల్లించడం లేదని, దీంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు ఎన్నికల సెలవు కావడంతో ఎంతసేపు ధర్నా నిర్వహించినా పట్టించుకునే వారు కరువయ్యారు. దీంతో అక్కడి నుంచి నిరాశతో వెనుదిరిగారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (భారత ప్రభుత్వరంగ సంస్థ)

సదాశివపేట శాఖ

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6) నిబంధనతో చదువబడే సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన.

శ్రీ మొరంగ్‌పల్లి ఏసురత్నం తండ్రి ఎం.సాయన్న (రుణగ్రహీతలు) మరియు శ్రీమతి మొరంగ్‌పల్లి శాంతమ్మ భర్త శ్రీ మొరంగ్‌పల్లి (హామీదారు)ల నుండి సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన సదాశివపేట శాఖ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు బకాయి 05-10-2023 నాటికి **రూ. 14,28,186.00 (పద్నాలుగు లక్షల ఇరవై ఎనిమిది వేల నూట ఎనభై ఆరు రూపాయలు మాత్రమే)** + వడ్డీ + ఇతర చార్జీలను రాబట్టుకొనుటకు సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖా పెట్టబడిన/చార్జ్ చేయబడిన, **సదాశివపేట శాఖ,** యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క అధీకృత అధికారిచే **లాంఛనప్రాయ స్వాధీనం** చేసుకోబడిన దిగువ వివరించిన స్థిరాస్తి ''ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలా'',''ఏది ఉంటే అది'' మరియు ''అక్కడ ఏమున్నదో అదే'' ప్రాతిపదికన **14.06.2024**న విక్రయించబడుతుందని ముఖ్యంగా రుణగ్రహీత(లు) మరియు హామీదారు(లు)కు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

రిజర్వు ధర: **రూ. 49,49,700/-** మరియు బయానా: **రూ. 4,94,970/-**

రుణగ్రహీత: శ్రీ మొరంగ్‌పల్లి ఏసురత్నం తండ్రి ఎం.సాయన్న, ఇం.నం. 6-3-76/3/1/9, ప్లాట్ నం. 40, సర్వే నం. 489A, AAలో, హనుమాన్‌నగర్, సదాశివపేట- 502291, మొబైల్: 9866145062.

సహ-రుణగ్రహీత: శ్రీమతి మొరంగ్‌పల్లి శాంతమ్మ భర్త శ్రీ మొరంగ్‌పల్లి ఏసురత్నం, ఇం.నం. 6-3-76/3/1/9, ప్లాట్ నం. 40, సర్వే నం. 489/A, AAలో, హనుమాన్‌నగర్, సదాశివపేట- 502291, మొబైల్: 9866145062.

సలిసమాన తనఖాపెట్టిన ఆస్తి: సదాశివపేట మున్సిపల్ లిమిట్స్, సంగారెడ్డి జిల్లా, రిజిస్ట్రేషన్ జిల్లా & జడ్పీ సంగారెడ్డి, రిజిస్ట్రేషన్ సబ్-జిల్లా సదాశివపేట, తెలంగాణ రాష్ట్రంలోని రాఘవేంద్ర నగర్ కాలనీ, బ్లాక్ నం.3, వార్డు నం.6లో, సదాశివపేట వద్దగల, ఏరియా విస్తీర్ణం వివరాలు: మొత్తం సైట్ ఏరియా: 60'x36'=2160'00" చ.అడుగులు లేదా 240 చ.గజాలు లేదా 200.66 చ.మీటర్లు కలిగిన, మున్సిపల్ ఇం.నం. 6-3-76/3/1/9, సర్వే నం. 489/A, AA, ప్లాట్ నం. 40 గల నివాసిత భూమి మరియు భవనం ఇల్లు. **సరిహద్దులు:** తూర్పు: ప్రకాశం బిలకంటి ప్లాట్ నం. 39, పశ్చిమం: యు.ఎల్.నర్సింహం ప్లాట్ నం.41, ఉత్తరం: చాట్ల ఈశ్వరప్ప ప్లాట్ నం.50, దక్షిణం: 20 అడుగుల వెడల్పు రోడ్.

సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తెలిసిన తాకట్టు రుణభారాలు: తెలియవు

అమ్మకం సవివరమైన నియమ నిబంధనల కొరకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సెక్యూర్డ్ క్రెడిటార్స్ వెబ్‌సైట్ అనగా **www.unionbankofindia.co.in, http://www.ibapi.in &** సర్వీస్ ప్రొవైడర్స్ వెబ్‌సైట్ అనగా **www.mstcecommerce.com**లో ఏర్పాటు చేసిన లింక్‌ను రిఫర్ చేయండి.

తేది: 09.05.2024 **అధీకృత అధికారి**

ప్రదేశం: సదాశివపేట

స్టాట్యుటరీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6)/ రూల్ 9(1) క్రింద చట్టబద్ధ 30/15 రోజుల అమ్మకం ప్రకటన

పైన తెలిపిన తేదీన ఇ-వేలం అమ్మకం నిర్వహించుట గురించి సదరు రుణం యొక్క రుణగ్రహీత/లు మరియు హామీదారు/లకు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6)/రూల్ 9(1) క్రింద నోటీసుగా కూడా దీనిని పరిగణించవలెను.